క్లుప్తంగా

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

మునగపాక : ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చూడాలన్నారు. సవరణలు, మార్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు.

నేడు పల్లపు ఆనందపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మునగపాక : పల్లపు ఆనందపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు సచివాలయ ప్రాంగణంలో ప్రభుత్వ పథకాల లబ్ధితో కూడిన డిస్‌ప్లే ఆవిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రేపు ముసిలితల్లి ఆలయ ప్రారంభోత్సవం



ముసిలితల్లి అమ్మవారి ఆలయం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు శివారు ముసలమ్మపాలెంలో వెలసిన శ్రీ ముసిలితల్లి అమ్మవారి నూతన ఆలయాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తప్పిటగుళ్లు, కోలాటం, మేళతాళాల మధ్య చండీయాగం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని వారు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న పారంపర్య వైద్య మహాసంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు

మునగపాక : మునగపాక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఔషధ మూలికా విజ్ఞాన సదస్సు మంగళవారంతో ముగిసింది. దీర్ఘకాలిక, ప్రాథమిక ఆరోగ్య రక్షణ సహజ పద్ధతిలో వ్యాధి నయం చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పారంపర్య వైద్య మహాసంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ సంప్రదాయ అలవాట్లు , ఆహారం క్రమబద్ధీకరించుకుంటూ వంటింట్లో సహజ ఆహారానికి వాడే మూలికలు అలాగే పరిసరాల్లో దొరికే సహజ మొక్కల వినియోగంతో సులభంగా వ్యాధిని తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలు, వృక్షాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలుగోలు ప్రసాదరావు, అల్లక రాజు, ప్రసాద్, చెంచలయ్య, డాక్టర్ ఆలీ మహమ్మద్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ మోహన్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 150 మంది వరకు పారంపర్య వైద్యులు పాల్గొన్నారు.

చురుగ్గా పంట నష్టం నమోదు



కట్టుబోలులో పంట నష్టం నమోదు చేస్తున్న వీఏఏ ప్రశాంతి

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న వరి పంట నష్టం నమోదు ప్రక్రియను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఏవో సి.సుమంత పర్యవేక్షణలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలు రెవెన్యూ సిబ్బంది సహకారంతో క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి సంబంధిత రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. వీరికి సంక్రాంతి లోపే పరిహారం అందిస్తామని సీఎం వై.ఎస్.జగన్ ప్రకటించారు. దీంతో ముమ్మరంగా పంట నష్టం నమోదు నిర్వహిస్తున్నారు.

నవ శకం... సంక్షేమ సంతకం



ఇంటింటా ఆరోగ్యసిరి



నేను వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సను ఏడాది క్రితం చేసుకున్నా. లక్షా పదివేలకు పైగా ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరించింది. ఆపరేషన్ తరువాత ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో స్థానికంగా ఉండే వైద్య సిబ్బంది ఎప్పటికపుడు నా ఆరోగ్య వివరాలు తెలుసుకునేవారు. ఈ పథకం పేద వర్గాలకు మేలు చేకూరుస్తోంది.

- పెంటకోట సత్యవతి, గవర్ల అనకాపల్లి



మేము వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్నాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ అనంతరం ఇంటికి పంపాక ఆరోగ్య ఆసరా ద్వారా రూ.5వేల మేర అకౌంట్‌లో నగదు జమ చేశారు. ఈ పథకం పేదోళ్లకు వరం.

- కాండ్రేగుల నూకరాజు, సూర్యకాంతం దంపతులు, తిమ్మరాజుపేట



నేను పక్షపాతంతో ఇబ్బందులు పడేవాడిని. కేజీహెచ్‌లో ఆపరేషన్ కోసం చేరా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందా. ఉచితంగా వైద్య సేవలు పొందాను. ఆరోగ్య శ్రీ ద్వారా ఖరీదైన వైద్యం కూడా ఉచితంగా అందుతుంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- సూరిశెట్టి జగన్నాథరావు, తిమ్మరాజుపేట

- ఖరీదైన వైద్యం..పేదలందరికీ ఉచితం
- బాసటగా నిలుస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- రూ.25 లక్షల వరకూ పరిమితి పెంపు

మునగపాక : మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి పేద ప్రజలకోసం అందుబాటులోకి తీసుకువచ్చిన వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుంది. అనారోగ్యంతో బాధపడే ప్రతి పేదవాడు కూడా కార్పొరేట్ ఆసుపత్రిలో ఖరీదైన వైద్యం పొందేందుకు వీలుగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకం అందుబాటులోకి వచ్చాక పేదల హృదయాల్లో వెలుగులు నింపారు. ఇదే పథకానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు వేస్తూ మరింతగా పేదలకు చేరువ కావాలన్న ఆశయంతో అవసరమయ్యే చర్యలకు శ్రీకారం చుట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో లక్షలాది రూపాయల వైద్యం ఉచితంగా అందేలా రూపకల్పన చేశారు. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారు.

ఆరోగ్య సేవలు ఇలా..

ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య ఎదురైనా, దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురైనా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం పొందవచ్చు. 104 కాల్ సెంటర్ ద్వారా మీ ఇంటి నుంచే ఆరోగ్య సమస్యను వివరించాలి. వివరాలను నమోదు చేసుకున్న తరువాత జబ్బుకు సంబంధించి ఏ ఆసుపత్రిలో చేరాలనే వివరాలు అందిస్తారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా కూడా సేవలు పొందవచ్చు. మీ కుటుంబానికి ప్రభుత్వ సేవలందిస్తున్న వలంటీర్ల ద్వారా సంప్రదించాలి. వారు స్థానికంగా ఉండే ఏఎన్‌ఎం, సీహెచ్‌వోల ద్వారా చికిత్స అందించేందుకు నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతారు.108 అంబులెన్స్ ద్వారా కూడా సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. అత్యవసర సమయంలో నేరుగా 108కు కాల్ చేయాలి.నిముషాల వ్యవధిలో అంబులెన్స్ ఇంటికి వస్తుంది. అవసరమయ్యే ప్రాథమిక చికిత్స అందించడమే కాకుండా ఉచితంగా వైద్యం అందించే నెట్‌వర్క్ ఆసుపత్రికి తీసుకువెళతారు. అక్కడి ఆరోగ్య మిత్ర ద్వారా ఆరోగ్య శ్రీ సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలను సందర్శించే క్రమంలో ఆరోగ్య సమస్యను విన్నవించడం ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రిలో వైద్యం పొందేలా పథకాన్ని రూపొందించారు.



మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా....

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ది పొందే ప్రతి లబ్దిదారునికి వైద్యం అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా 1519 రకాల చికిత్సలకు వైద్యుల సలహాల మేరకు రోగికి నెలకు రూ.5వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రి ద్వారా చికిత్స పొంది బయటకు వచ్చేలోగానే నేరుగా బాధితుని బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుంది.



ఆరోగ్యశ్రీలో చికిత్స చేసుకొన్న రోగుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఏఎన్‌ఎం దేవకి

సేవలు సంతప్తికరంగా లేకుంటే ఫిర్యాదు ఇలా..

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పొందే సేవలు సంతృప్తికరంగా లేకుంటే 104 కు సమాచారం అందించాలి. ఇలా వచ్చిన ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. సంబంధిత ఫిర్యాదులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కాల్ సెంటర్‌కు అనుసంధానం అవుతుంది. వైద్యం పొందే సమయంలో ఎవరైనా లంచం అడిగితే 14400కు ఫిర్యాదు చేయవచ్చు.

నేటి నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాలు



ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి వాసుల ఇలవేల్పు ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొఠారు సాంబ, కొండబాబు తెలిపారు. మంగళవారం రాత్రి వారు ఉత్సవాల వివరాలను విలేకరులకు తెలిపారు. 13వ తేదీ ఉదయం నుంచి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా ప్రారంభిస్తామని తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ప్రతి ఏటా వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఉత్సవాల్లాగానే ఇక్కడ కూడా మార్గశిర మాసోత్సవాలు జరుగుతాయి. ప్రతి గురు, శుక్రవారాల్లో సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజల్లో మహిళలు, దంపతులు పాల్గొంటారు. ప్రతి రోజూ సాయంత్రం, రాత్రి వేళల్లో ఆధ్యాత్మిక, సంగీత కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవాల పర్యవేక్షకులు తాటిపాకల చిన్ని, ఏబీఎల్ రాజు తెలిపారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు భక్తులను కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు
- లంకెలపాలెం హైస్కూల్ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

అగనంపూడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. ఈ అంశంలో పాఠశాలల సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలల వివరాలు అడిగి, వారికి ప్రభుత్వం అందిస్తున్న మందులు విధిగా తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత రాగి మాల్ట్ రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వాహణ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణాలకు అడ్డంకులా..!



గ్రామ పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న

ఎస్.రాయవరం : రేవుపోలవరం పరిధిలో నాడు నేడు అభివృద్ధి పనులను ఆటంక కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్న కాలనీకి ఆనుకుని సుమారు 3 కోట్ల రూపాయలతో పాఠశాల అదనపు భవనాలు, వంట షెడ్డు నిర్మాణాలు చేస్తుంటే మూడు నెలలుగా ప్రభుత్వ భూమి ఆక్రమణదారులు పనులకు ఆటంక పరుస్తున్నారని గ్రామస్థులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. నాడు నేడు రెండో విడతలో రూ.2.90 కోట్లతో పాఠశాల నూతన భవన నిర్మాణాలు ప్రారంభించారు. అయితే ఆ భూమి తనదంటూ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తూ ఒకరిద్దరు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు చొరవ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 350 మంది పిల్లలు ఉన్నారని, భవన నిర్మాణాలు పూర్తయితే సుమారు 6 వందల మంది వరకు విద్య నభ్యసిస్తారని, రేవు పోలవరం, కొత్త రేవు పోలవరం, చిన ఉప్పలం, బంగారమ్మపాలెం, కాపుల వాతాడ గ్రామాల విద్యార్థులకు సదుపాయంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను అడ్డుకోవడం దారుణమని అన్నారు. అధికారులు సత్వరం చొరవ తీసుకుని నాడు నేడు పనులు సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు సీహెచ్ అప్పన్న, మాజీ ఎంపీటీసీలు చోడిపల్లి కోదండ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయంగా పాలన



సంక్షేమం, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. మంగవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, విద్యా కానుక, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం తదితర సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ చేయడం జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ పథకాలన్నీ యథాప్రకారం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టాలని అన్నారు. అంతకు ముందు రూ.33 కోట్ల సంక్షేమ లబ్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, ఎంపీటీసీ విజయలక్ష్మి రామగోవిందు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జీసస్ బోధనలతో మానవాళికి వెలుగు



ప్రార్థనా మందిరంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : క్రీస్తు ప్రబోధాలు మానవాళికి వెలుగును నింపాయని, ఆయన బోధనలు మానవాళికి మార్గదర్శకం అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పట్టణంలో గల బేతేలు ప్రార్థన మందిరంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఐక్య క్రిస్మస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యధికంగా ప్రజలు క్రీస్తును ఆరాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబు, సర్పంచ్ గారా ఉషశ్రీ ప్రసాద్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామకృష్ణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ సభ్యులు, పాస్టర్ల్ పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక దీక్షలు



పంచదార్లలో ఉమా ధర్మలింగేశ్వరస్వామి

రాంబిల్లి: కార్తీకమాసం దీక్షలు మంగళవారం ముగిశాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రానికి తరలివచ్చిన భక్తులు తొలుత ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నెల రోజులు పాటు భక్తిశ్రద్ధలతో కార్తీక దీక్షను ఆచరించిన భక్తులు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని దీక్షను విరమించారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ జగనన్నే సీఎం



పథకాల లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు



సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌లు

మునగపాక : ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మరోసారి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అన్నారు. ప్రజలంతా తమకు జరిగిన లబ్ధిని గుర్తించి జగన్‌మోహన్ రెడ్డికి మరో అవకాశం కల్పించాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వాడ్రాపల్లి సచివాలయ ప్రాంగణంలో ప్రభుత్వ లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులిచ్చే మోసపూరిత హామీలను నమ్మకుండా ప్రజల కోసం శ్రమించే జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, సచివాలయ కన్వీనర్లు రామజోగినాయుడు, మళ్ల జోగినాయుడు, పార్టీ నేతలు లీలా భాస్కర్, భాస్కరరావు, కన్నుంనాయుడు, శీరా రమణమ్మ పాల్గొన్నారు. అనంతరం గ్రామ కూడలిలో పార్టీ జెండాను పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు ఆవిష్కరించారు. మునగపాకలో వలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

సంక్షేమ లబ్ధిని వివరించండి...

ఎస్.రాయవరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న వారికి మరోమారు గుర్తు చేసేవిధంగా వలంటీర్లు సర్వే చేయాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. ఉప్పరాపల్లి గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి విడుదలైన సంక్షేమ పథకాల వివరాలు ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఉప్పరాపల్లి, వెంకటాపురం సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. మాజీ సర్పంచ్ శానాపతి అప్పలనాయుడు, కన్వీనర్లు రమణమూర్తి, సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చిన్నారావు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి

మత్స్యకారుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

నక్కపల్లి: రాజయ్యపేటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గ్రామంలో ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాల ఫ్లెక్సీని జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి ఆవిష్కరించారు. మత్స్యకారుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నియోజకవర్గానికి ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేశారని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమై మత్స్యకారుల ఉపాధి మెరుగుపడుతుందని, మార్కెటింగ్ సదుపాయం, ఎగుమతులు, దిగుమతులు పెరుగుతాయని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. వీరంతా జగన్‌మోహన్‌రెడ్డినే ఆశీర్వదిస్తారన్నారు. ఎంపీటీసీ చంద్రరావు, పార్టీ నాయకులు ఎరిపల్లి నాగేశు, నూకరాజు, సూరిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు వేదికగా 'ఆడుదాం ఆంధ్రా'



ఆడుదాం ఆంధ్రాకు క్రీడా సామాగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామీణ క్రీడాకారులు ప్రతిభ వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని పాయకరావు పేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో పలు గ్రామ సచివాలయాల కేటాయించిన క్రీడా సామాగ్రిని కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక వేదిక ఎంచుకోవాలని, ఆ బాధ్యత ఈ ఏడాది ప్రభుత్వమే తీసుకుందన్నారు. క్రీడల్లో రాణించి చాలా మంది అవకాశాలు లేక వేరు వేరు వృత్తుల్లో స్థిరపడ్డారని, అలాంటి వారికి ప్రత్యేక అవకాశం ఆడుదాం ఆంధ్రాలో వచ్చిందన్నారు. ముందు సచివాలయాలు పరిధిలో విజేతలుగా నిలిచిన వారు మండల స్థాయిలోనూ, జిల్లాకి, రాష్ట్ర స్థాయిలో పాల్గొని ఆడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, సత్యనారాయణ, ప్రసాద్, నాయుడు, రామలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, కొరుప్రోలు సర్పంచ్ సూరివేణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నోటిఫికేషన్ రద్దు

నక్కపల్లి : స్థానిక ఐసీడీసీఎస్ ప్రాజెక్టు పరిధిలో నక్కపల్లి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దయినట్టు సీడీపీవో శ్రీవిద్య తెలిపారు. గత నెల 24న మండలంలో ఉన్న మూడు అంగన్‌వాడీ కార్యకర్తలు, 13 సహాయకుల పోస్టుల భర్తీకి ఆర్‌డీవో నోటిఫికేషన్ విడుదల చేశారని, ఈ నోటిఫికేషన్ రద్దయిందని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ రద్దు కావడంతో గత నెల 24 నుంచి ఈ నెల 4 వరకు వచ్చిన దరఖాస్తులు కూడా రద్దయినట్టేనని ఆమె పేర్కొన్నారు.

నేడు గౌరమ్మ నిమజ్జనోత్సవం



కశింకోట: స్థానిక గవరపేట రామాలయంలోనెలకొల్పిన ఆది గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజుల క్రితం గౌరమ్మ విగ్రహాన్ని నెలకొల్పామన్నారు. కార్తీక మాస పూజలు ముగియడంతో గ్రామ వీధుల్లో సంప్రదాయంగా ఊరేగించి స్థానిక శారదానదిలో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.